
# అమృత దోష పరిహారకుడు
# శ్రీ పడమటి ఆంజనేయస్వామి

- జాంబవంతుల వారిచే ప్రతిష్టాపన
- ఎలాంటి ఆధారం లేని భారీ విగ్రహం
- పై కప్పు లేని గర్భాలయం
- నేటి నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ప్రత్యేక ఆకర్షణగా 33 అడుగుల ఆంజనేయ విగ్రహం



మక్తల్, డిసెంబర్ 24, వాయిస్ టుడే ప్రతినిధి: శని దోష అపమృత్యు దోష పరిహారకుడు మక్తల్ పట్టణంలో వెలసిన శ్రీ పడమటి ఆంజనేయ స్వామి వారు. భక్తితో కొలిచే భక్తులకు కొంగుబంగారమై భాసిల్లుతున్నారు .పుత్రార్థులకు పుత్రులను యశార్థులకు కీర్తిని విద్యార్థులకు విద్యను ప్రసాదించి కోరిన కోరికలు తీర్చే స్వామి గా భాసిల్లుతున్నారు. ప్రతి ఏటా డిసెంబర్ మాసంలో వచ్చే మార్గశిర బహుల పాడ్యమి పౌర్ణమి రోజున స్వామి వారి బ్రహ్మోత్సవాలు(జాతర) రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ నెల 24 నుండి 30వ తేదీ వరకు శ్రీ పడమటి ఆంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు (జాతర) అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి పాలమూరు జిల్లా నుండే కాకుండా ముంబాయి, పూణే, షోలాపూర్ ,అంబర్నాథ్ ,గుల్బర్గా ,బెంగళూరు ,ఆదోని,హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు తరలివస్తారు. బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వయంగా జాంబవంతుల వారే స్వామి వారిని ప్రతిష్ఠించారని ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. పశ్చిమ ముఖ బంగిమలు స్వామివారి విగ్రహం ఉండటం వల్ల శ్రీ పడమటి ఆంజనేయ స్వామిగా భక్తులు పిలుస్తుంటారు. స్వామివారిని కొలిచే భక్తులకు కొంగుబంగారమై భాసిల్లుతున్నరు.

**ఆలయ చరిత్ర ..........**

పాలమూరు ఉమ్మడి జిల్లా కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలో కర్ణాటకలోని రాయచూరుకు 40 కిలోమీటర్ల దూరంలో మక్తల్ పట్టణంలోని ప్రధాన రహదారి 167 వ జాతీయ రహదారి పక్కనే వెలిసిన శ్రీ పడమటి ఆంజనేయ స్వామి వారిని సాక్షాత్తు జాంబవంతుల వారె ప్రతిష్టించినట్లు పురాణాలు ద్వారా తెలుస్తోంది.

స్వామి వారిని జాంబవంతుల వారు పశ్చిమ ముఖ భంగిమలో ప్రతిష్టించడం వల్ల స్వామి వారిని శ్రీ పడమటి ఆంజనేయస్వామి గా వ్యవహరిస్తున్నట్లు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తున్నది. అంతేకాకుండా స్వామి వారి విగ్రహం ఒకవైపున ఒరిగినట్లు(వంగి) కనిపిస్తుంది.

పూర్వం స్వామి వారిని సేవించే అర్చకుడు పొట్టిగా ఉండడం వల్ల పూజాదికాలు నైవేద్యం సమర్పించడం కష్టంగా ఉండేదట అప్పుడు ఆ అర్చకుడు నిష్ఠతో ప్రార్థించి ఒకవైపునకు ఒరిగితే తప్ప నైవేద్యం పెట్టలేనని ప్రార్థించగా అప్పుడు స్వామి వారు ఒక వైపునకు పడమర దిక్కునకు ఒరిగినట్లు ప్రతీతి. అంతేకాకుండా సీతాదేవి అన్వేషణలో రాముని ఉంగళీకాన్ని (ఉంగరాన్ని) తీసుకు వెళుతున్న భంగిమలో ఉంటాడని భక్తుల ప్రగాఢ నమ్మకం.

**ఆధారంలేని భారీ విగ్రహం......**

ఇక్కడ వెలిసిన శ్రీ పడమటి ఆంజనేయ స్వామివారి భారీ విగ్రహం భూమిపై ఎలాంటి ఆధారం లేకుండా నిల్చొని ఉండటం విశేషం. సుమారు పది అడుగుల పైనే ఉన్న స్వామివారి విగ్రహం ఎలాంటి ఆధారం లేకుండా ప్రతిష్టించడం సాధ్యం కాదు. కానీ ఇక్కడి స్వామి వారి విగ్రహం ఇప్పటికీ ఎలాంటి ఆధారం లేకుండా ఉందంటే నమ్మశక్యం కాదు. గర్భాలయంలో ఉన్న స్వామివారి విగ్రహానికి భూమికి మధ్య సన్నటి కట్టెపుల్ల ఆడించిన అటు ఇటు జరుగుతుంది. దీంతో ఈ విగ్రహం ఎలాంటి ఆధారం లేకుండా ఉందన్న సత్యం అందరికీ అర్థమవుతుందని అర్చకులు పేర్కొంటున్నారు. కాగా ఇక్కడ స్వామివారి విగ్రహానికి విశేషం ఏమిటంటే నీడ ఏటవాలుగా స్వామి వారి మూల విగ్రహానికి సోకకపోవడం మరో విశేషం.



### ప్రత్యేక ఆకర్షణగా 33 అడుగుల హనుమంతుడి విగ్రహం......

శ్రీ పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలలో 33 అడుగుల ఆంజనేయుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. 2016లో మండలంలోని అనుగొండ గ్రామానికి చెందిన కొత్త కాపు గోవర్ధన్ రెడ్డి సంయుక్త దంపతులు రూ. 10 లక్షల వ్యయంతో 33 అడుగుల భారీ ఆంజనేయ విగ్రహం ఏర్పాటు చేయించారు. జాతీయ రహదారిపై ఈ ఆలయం ఉండడం వల్ల హనుమంతుడి విగ్రహం వచ్చి పోయే వారికి ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తోంది.

### సింధూర లేపనం స్వామివారికి ప్రీతిపాత్రం......



మక్తల్ పట్టణంలో వెలసిన శ్రీ పడమటి ఆంజనేయస్వామి వారికి సింధూర లేపనం అత్యంత ప్రీతిపాత్రమైనదని అర్చకులు చెబుతారు .పూర్వం స్వామివారి నిజ రూపం దర్శించుకోవాలని ఉద్దేశంతో అర్చకులు విగ్రహంపై అట్ట గా పేరుకుపోయిన సింధూర లేపనం తీసివేయడానికి ఒక మేకు తో తీసేందుకు ప్రయత్నించగా ఆ రాత్రికి స్వామివారు అర్చకుడి స్వప్నంలో కనిపించి ఎందుకయ్యా ఇలా నా దేహాన్ని గీస్తున్నావని ప్రశ్నించినట్లు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. విగ్రహాన్ని ఎక్కడెక్కడ గీచాడు ఆయా చోట్ల అర్చకుడి శరీరంపై గాయాలు అయ్యాయట. దీంతో స్వామివారిని ప్రార్థించి సింధూర లేపనం చేశారట. స్వామివారికి సింధూర లేపనం చేశారట అలా స్వామి వారికి సింధూరలేపనం అంటే ప్రీతిపాత్రమైనదిగా తెలుస్తోంది. ఎంతో మహిమాన్వితమైన స్వామివారిని దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుండి బ్రహ్మోత్సవాలు భక్తులు తరలి వస్తుంటారు. అంతేకాకుండా ప్రతినిత్యం వందల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని వెళుతుంటారు.

### పై కప్పు లేని గర్భాలయం......

స్వామివారి గర్భాలయానికి పైకప్పు లేదు. పూర్వం ఎన్నోసార్లు పైకప్పు వేసినప్పటికీ అది బీటలువారి పోయిందట. అందుకు ఆగమన శాస్త్రం ప్రకారం పవిత్ర నదీ జలములతో ఒకే రోజున పైకప్పు వేసినచో నిలుస్తుందట. ఒకే రోజున పవిత్ర నదీ జలములతో పైకప్పు వేయడం సాధ్యం కానందున వదిలి వేసినట్లు తెలుస్తోంది. అప్పటినుండి నేటి వరకు గర్భాలయానికి పై కప్పు లేకుండా అలాగే ఉంది.




### బ్రహ్మోత్సవాల వివరాలు........

శ్రీ పడమటి ఆంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 24న ఆదివారం నుండి 30వ తేదీ శనివారం వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. 24న మార్గశిర శుద్ధ త్రయోదశి ఆదివారం ఉదయం 7:00 గంటలకు పట్టణ పురవీధుల గుండా స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఉత్తరాది మఠం నుండి ఉరేగిస్తూ దేవాలయానికి తీసుకురావడం జరుగుతుంది. 7:30 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది .సాయంత్రం 6 గంటలకు గజవాహన సేవ నిర్వహిస్తారు. 25న సోమవారం పవమాన హోమం నెమలి వాహనసేవ సాయంత్రం 6 గంటలకు ప్రభోత్సవం జరగనుంది . 26న మంగళవారం పౌర్ణమి రోజున సాయంత్రం 6 గంటలకు స్వామివారి రథోత్సవ వేడుకలు (తేరు) అంగరంగ వైభవంగా జరగనున్నాయి. 27న బుధవారం 5:30 గంటలకు హంస వాహన సేవ 6 గంటలకు పాల ఉట్లు కొట్టడం జరుగుతుంది. 28న గురువారం ఉదయం 10 గంటలకు చక్రతీర్థం స్నానం 11 గంటలకు అశ్వవాహన సేవ 7 గంటలకు టేకు రథోత్సవం(పూలరథం) 29న సాయంత్రం 6 గంటలకు ఉష్ట్రవాహన సేవ,30న శనివారం సాయంత్రం 6 గంటలకు కల్పవృక్ష వాహన సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పి. భీమాచార్య, మేనేజర్ జె.శ్యాంసుందరాచారి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తరించాల్సిందిగా వారు కోరారు.



## మంగళూరులో భీమా

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భీమా'. ఏ.హర్ష దర్శకత్వంలో శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఆదివారం నుంచి మంగళూరులో మొదలైంది. హీరో గోపీచంద్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణం పాల్గొంటున్నారు. మంగళూరులోని దట్టమైన అడవిలో ఓ పాటతో పాటు యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఫ్యామిలీ ఆడియెన్స్‌ను మెప్పించే అన్ని అంశాలుంటాయి. అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కిస్తున్నాం. గోపీచంద్ పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె గౌడ, సంగీతం: రవి బస్రూర్, సంభాషణలు: అజ్జు మహంకాళి, దర్శకత్వం: ఏ. హర్ష.



## ఆ సినిమా ప్రేక్షకులతో కలిసే చూస్తానంటున్న నిత్యామీనన్

ఆ మధ్య కాస్త నిదానించిన నిత్యామీనన్ గత ఏడాది 'తిరు' సినిమాతో మళ్లీ జూలు విదిల్చింది. అటు తమిళంలో, ఇటు తెలుగులో మంచి హిట్ అందుకుంది. దాదాపు తన కెరీర్ ముగిసిందని అందరూ అనుకుంటున్న సమయంలో వచ్చిన 'తిరు' నిత్యామీనన్‌కి మళ్లీ పెద్ద బ్రేక్‌గా నిలిచిందని చెప్పక తప్పదు. ఆ తర్వాత 'కుమారి శ్రీమతి' వెబ్‌సిరీస్ కూడా తనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం తమిళంలో జయం రవి హీరోగా తను నటిస్తున్న చిత్రం 'కాదలిక్క నేరమిట్లాలై'. 60ఏళ్ల క్రితం ఇదే పేరుతో తమిళంలో ఓ చిత్రం రూపొందింది. ఆ సినిమా ఇప్పటికీ అక్కడ క్లాసిక్.

ఆ పేరుతో ఇప్పుడు సినిమా చేయడం అంటే నిజంగా సాహసమే. ఉదయ్‌నిధి స్టాలిన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆయన భార్య కిరుతిగ ఉదయ్‌నిధి దర్శకురాలు. ఈ సినిమా గురించి నిత్యామీనన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'మణిరత్నం 'ఓకే కణ్మని' తర్వాత నేను చేస్తున్న పూర్తిస్థాయి ప్రేమకథ ఇది. ఇందులో పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. కురితిగ అద్భుతమైన దర్శకురాలు. తను నా పాత్రను తీర్చిదిద్దిన తీరు అద్భుతం. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేశాం. బహుశా సమ్మర్‌లో విడుదల ఉండొచ్చు. నేను మాత్రం ప్రేక్షకుల మధ్యలో కూర్చొని ఈ సినిమా చూస్తా' అని చెప్పుకొచ్చింది నిత్యామీనన్.